

రోశయ్య గారికి పాఠం ఒక నిమిత్తం.
ఆయన అసలు మిషన్ విద్యార్థుల మేధను వికసింపజేయటం.
జ్ఞాన ప్రపంచ ద్వారాలను విద్యార్థుల కోసం తెరవటం.

# మేధ, హృదయాల జుగల్‌బంది

**ఓల్గా**

రోశయ్యగారు మంచి టీచరనే మాట ఆయన దగ్గర చదువుకున్న విద్యార్థులనెవరినడిగినా చెబుతారు. ఐతే ఆ 'మంచి'కి అర్థం ఏమిటన్న దగ్గరే రోశయ్యగారి ప్రత్యేకత తెలిసేది. పాఠాలు అర్థమయ్యేలా చెప్పి, ఎప్పటి సిలబస్ అప్పుడు పూర్తిచేసి, అవసరమైతే నోట్సులు ఇచ్చి, పరీక్షలకు తయారుచేసే టీచర్ మంచి టీచరని గనక అనుకున్నట్లయితే రోశయ్య గారికి మంచి టీచర్ అనే పదం సరిపోదు. గొప్ప టీచరనో, మరొకటనో చెప్పుకోవాలి. మేం చదువుకునే రోజుల్లో అలాంటి గొప్ప టీచర్లు తక్కువగానైనా ఉండేవారు. ఇప్పుడు అసలు కన్పించటంలేదు. రోశయ్య గారికి పాఠం ఒక నిమిత్తం. ఆయన అసలు మిషన్ విద్యార్థుల మేధను వికసింపజేయటం. జ్ఞాన ప్రపంచ ద్వారాలను విద్యార్థుల కోసం తెరవటం. ఒకసారి ఆ తలుపులు తెరచిన తర్వాత విద్యార్థులకు ఈ మామూలు పరీక్షలూ, మార్కులూ - ఇవి ఒక లెక్కలోనివి కావు.

నేను 1967-70 సంవత్సరాలలో ఏ.సి. కాలేజ్‌లో చదివాను. రెండేళ్ళు రోజూ రోశయ్యగారి లెక్చర్స్ విన్నాను. ఆయన మాకు మిల్టన్ ప్యారడైజ్ లాస్ట్ చెప్పేవారు. మిల్టన్ ఆయన అభిమాన కవి. ఆ కవి గొప్ప కావ్యం ప్యారడైజ్ లాస్ట్. ఇక

రోశయ్యగారి ఉత్సాహం చూడాలి. ఆయన మా బ్యాచ్ తర్వాత కొద్దికాలానికే ఏ.సి. కాలేజ్ నుంచి రిటైరయ్యారనుకుంటాను. అంటే మాకు మిల్టన్ చెప్పినపుడు ఆయన యాభయ్యవ పడిలో అదీ చివరి సంవత్సరాలలో ఉన్నారు. కానీ ఆయన ఉత్సాహం మాత్రం ముప్పయ్యేళ్ళ వయసుది. క్లాసుకి బోలెడు పుస్తకాలు తెచ్చేవారు. ఆయన ఎందుకన్ని పుస్తకాలు మోసుకొస్తున్నారో చాలామందికి అర్థమయ్యేది కాదు. ఒక్క పుస్తకం కూడా చేతిలో లేకుండా క్లాసుకొచ్చి లెక్చరిచ్చివెళ్ళే ఉపాధ్యాయులు కూడా ఉండేవారు. వాళ్ళతో పోల్చి ఈయనను చాదస్తుడని అనుకునేవాళ్ళూ ఉండేవారు. కానీ పుస్తకాలను వెంట తెచ్చుకోవటం, వాటిలో విషయాలను రెఫర్ చేయటం, ఆ పుస్తకాలను ప్రేమగా స్పృశించటం, వాటి గొప్పదనానికి ముగ్ధులైపోవటం-ఇవన్నీ చేయటం వల్ల ఆయన పరోక్షంగా విద్యార్థులకు కొన్ని విషయాలూ, విలువలూ నేర్పుతున్నారని నేను అనుకునేదాన్ని. పుస్తకాలను, రచయితలనూ ప్రేమించటం పదిహేడేళ్ళ వయసులో అపుడపుడే నేర్చుకుంటున్న నేను రోశయ్యగారి శిక్షణలో ఏ.సి. కాలేజ్ లైబ్రరీ నా స్వంతమన్నట్లు చదివేశాను. పుస్తకాలు కొనటం, నా స్వంత లైబ్రరీ తయారుచేసుకోవటం అలవాటయింది. ఆయన ఏనాడూ నోటితో పుస్తకాలు కొనమనో, లైబ్రరీ తయారుచేసుకోమనో చెప్పలేదు. కానీ ఇన్ని పుస్తకాలు క్లాసుకి తెచ్చి, వాటి గురించి చెబుతూ, అవి తన స్వంతమని గర్వపడటం చూస్తుంటే, జీవితంలో ఏ సంపదకు గర్వపడాలో నాకు అర్థమయింది. చెప్పే పాఠాలకంటే చెప్పకచెప్పే పాఠాలకు ఎంత బలముంటుందో రోశయ్యగారికి బాగా తెలిసివుంటుంది.

ప్యారడైజ్ లాస్ట్‌లో మొదటి మూడుపేజీలూ చెప్పుకోవటంలో ఆరునెలలు గడిచిపోయాయి. ఈ ఆరునెలల్లో మిల్టన్ గురించి ఎంత తెలిసిందో షేక్స్పియర్ గురించీ, కీట్సు, షెల్లీల గురించీ, రామరాజభూషణుడి గురించీ, మహాభారతం గురించీ, చిన్నయసూరి

గురించీ అంతా తెలిసింది. ఆ రచయితల్నీ కూడా మేం చదువుతున్నాం. మా సాహిత్య ప్రపంచం విస్తరించింది. ఆ సాహిత్య ప్రపంచ సౌందర్యం ముందు మేం దిగ్భ్రాంతులమై నిల్చునేలా చేశారు రోశయ్యగారు. నిజానికి తెలుగు లిటరేచర్ క్లాసులో వసుచరిత్ర చదువుకుంటున్నాను, ప్రతి పదార్థ, తాత్పర్యసహితంగా. ఆ పాఠాలు మాత్రమే అయితే నేను వసుచరిత్రను అంత ఇష్టపడేదాన్ని కాదేమో. ఇంగ్లీషు క్లాసులో రోశయ్యగారు రామరాజభూషణుడి గురించి చెప్తున్న వివరాలకూ, విశేషాలకూ ముగ్ధురాలినై వసుచరిత్రలో పద్యాలను పదేపదే చదివేదాన్ని. ఆ లయకూ, శబ్ద మాధుర్యానికీ మేధా చమత్కారానికీ ఉబ్బితబ్బిబ్బయ్యే రోశయ్యగారిని గుర్తుతెచ్చుకుంటూనే ఈ రోజుకీ వసుచరిత్రలో పద్యాలు చదువుతాను. మిల్టన్‌ని రోశయ్యగారి దగ్గర చదువుకోకపోతే ఆ కవిత్వపు ఔన్నత్యం అర్థమయ్యేది కాదు. ఆ కవిత్వం ఎందుకు 'sublime' అయిందో, మిగిలిన కవులు ఆ స్థాయికి చేరటం ఎంత కష్టమో ఆయన చెప్తుంటే ప్రతి పదాన్నీ మనస్సులోకి ఇంకించుకునేదాన్ని. ఆయన మిల్టన్‌ని తన మిల్టన్‌ని చేసుకుని షేక్స్పియర్‌ని ''మీ షేక్స్పియర్'' అంటూ విద్యార్థులకు ఇచ్చేసేవారు. దానితో చాలామంది రోశయ్యగారికి షేక్స్పియర్ అంటే ఇష్టం లేదనీ, కోపమనీ అనుకునేవారు. నేనది కరెక్టనుకోను. రోశయ్యగారికి విద్యార్థులంటే చాలా ఇష్టం. ఎంత ఇష్టం లేనిది రోజూ కోటుజేబుల్లో చాక్లెట్లు నింపుకువచ్చి కాలేజ్‌లోకి వస్తూనే తనకు ఎదురైన విద్యార్థులకు అవి పంచిపెడతారూ? ఆయనకు విద్యార్థులంటే ఎంత ఇష్టమో షేక్స్పియర్ అన్నా అంతే ఇష్టం. ఐతే ఇద్దరిలో ఉండే బలహీనతలూ, ప్రలోభాలూ, ఏవో చిలిపిచేష్టలతో జనాకర్షణ చేసే తీరూ-ఇవి ఆయనకు కాస్త చిరాకు తెప్పించేవి. అదీ కొద్దిసేపే. తర్వాత విద్యార్థుల వయసునీ, దానికితగ్గ వారి మనస్తత్వాన్నీ, నాటకాన్ని జనరంజకం చేసి తీరాల్సిన షేక్స్పియర్ బాధ్యతనీ అర్థం చేసుకునేవారు. అందువల్లే ఆయన శిష్యులమైన చాలామందికి షేక్స్పియర్ అంటే చాలా యిష్టం. ఆయన

క్లాసులు జ్ఞానార్తులైన విద్యార్థుల దాహాన్ని తీర్చి, సాహిత్యం మీద ప్రేమనూ, అభినివేశాన్నీ కలిగించేవి.

ఆయనలో మేధ, హృదయం రెండూ పోటీ పడేవి. ఒక్కోసారి ఒకోటి గెలిచేది. రెండింటిమధ్యా నిరంతరం ఘర్షణ జరుగుతూనే ఉండేది. మిల్టన్, షేక్స్పియర్‌ల మధ్య పోటీ కూడా మేధకూ హృదయానికీ మధ్య జరిగే పోటీయొక్క ప్రతిఫలనమే. ఆ పోటీ చూడటం నాకు చాలా ఆనందంగా ఉండేది. రోశయ్యగారొక్కరే బ్రహ్మాండమైన జుగల్‌బందీ-బాలమురళీకృష్ణ భీమ్‌సేన్ జోషిల స్థాయిలో-చేస్తున్నట్లు ఉండేది. తన్మయురాలినై ఆ పోటీలో లీనమయ్యేదాన్ని. గెలుపు ఓటములు ప్రధానం కావు. అవి ఎవరికి కావాలి? ఆ మేధా విన్యాసం, ఆ హృదయ మార్దవం వీటి విశ్వరూప సాక్షాత్కారం జరుగుతుంటే! నిజానికి ఆయనతో నాకు వ్యక్తిగతమైన పరిచయమేదీ లేదు. నా క్లాస్‌మేట్స్ బీనా, సుభద్రలకు ఆయనతో కుటుంబపరమైన స్నేహాలుండేవి. ఆయన వాళ్ళను ఆప్యాయంగా పలకరిస్తుండేవాళ్ళు. వెక్కిరిస్తుండేవాళ్ళు. మందలిస్తుండేవాళ్ళు. నేను అనంతమైన ఆయన విద్యార్థిసమూహంలో ఒకదాన్ని. ఆయనపై నా అభిమానం, ఆయన నుంచి నేనెంతో నేర్చుకున్న విషయం, ఆయన తెరచిన జ్ఞానద్వారాల గుండా నా ప్రయాణం-ఇవేవీ ఆయనకు తెలియవు. చెప్పాలని నేను ప్రయత్నం కూడా చెయ్యలేదు. ఎందుకంటే ఆ దారిలో నడిచింది నేనొక్కదాన్నే కాదు. ఆయన వెలిగించిన దీపాలకాంతి ప్రకాశిస్తూనే వుంటుందని ఆయనకు తెలుసు. వ్యక్తులకు కాదు ప్రాధాన్యత. జ్ఞాన ప్రవాహానికి. ఆంధ్రదేశంలో ఆ జ్ఞాన ప్రవాహాన్ని నిరంతరంగా, నిరంతరాయంగా చేసేందుకు కృషిచేసిన మేధావులలో రోశయ్యగారొకరు. విద్యార్థుల హృదయాలలో ఆయన చిరంజీవి. ఆయన నేర్పిన విలువలు ఆయన విద్యార్థుల ద్వారా చిరకాలం జీవిస్తాయి.